# 'మరుగుదొడ్ల నిర్మాణాల్లో వెనుకబాటు సహించం'

**గజపతినగరం, న్యూస్‌టుడే:** అన్ని అనారోగ్యాలకు ప్రధాన కారణం పారిశుద్ధ్య లోపం అయినందున ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఎవరు మరుగుదొడ్ల నిర్మాణాలను వెనుకంజ వేసినా సహించేది లేదని ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మరగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.డిల్లీరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అక్టోబరు 2 నాటికి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు ఎంపిక చేసిన గుడివాడ, దావాలపేట పంచాయతీల్లో ముందుగా నిర్మాణాలు పూర్తికావాలని అన్నారు. ఈమేరకు దావాలపేట గ్రామపెద్ద ప్రసాద్‌కు బాధ్యతలను అప్పగించారు. గుడివాడ గ్రామంలో 20 మాత్రమే మిగిలి ఉన్నందున వాటిని పూర్తిచేయించే బాధ్యతను సర్పంచి మీనాక్షీదేవికి అప్పగించారు. అక్టోబరు నెలాఖరు నాటికి మండలంలోని లోగిశ, ముచ్చర్ల, ఎం.కొత్తవలస, సాలిపేట, కాలంరాజుపేట, బూదేవిపేట గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేయించాలని ఏపీవో సత్యవతిని ఆదేశించారు. గజపతినగరం మేజరు పంచాయతీలోని ఎం.వెంకటాపురం గ్రామంలో పూర్తి నిర్మాణాల బాధ్యతను భాజపా కార్యవర్గ సభ్యుడు పి.వి.వి.గోపాలరాజుకు, గజపతినగరంలో ఉన్న నాలుగు వార్డుల్లో సర్పంచి నరవ ఆదిలక్ష్మికి, మూడేసి వార్డుల్లో ఎంపీటీసీ సభ్యులు కర్రి శ్రీదేవికి, నగర ప్రసన్నకుమారికి అప్పగించారు. వీరికి పూర్తి సహకారాన్ని తహసీల్దార్ అందించాలని అన్నారు. పురిటిపెంట పంచాయతీలో పూర్తిగా నిర్మాణాలు చేయించే బాధ్యతను జిల్లా తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి రావి శ్రీధర్‌కు, మండల పార్టీ అధ్యక్షుడు గంట్రేటి అప్పలనాయుడుకు అప్పగించారు. ఎంపీడీఓ వారికి సహకరించాలని తెలిపారు. ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యుడు మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.